# శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామివారి ఆలయము, పేరవరము.

డా జొన్నలగడ్డ మార్కండేయులు, పేరవరము.

శ్రీరాముడు అయోధ్యలోనే జన్మించాడన్న విషయమై ఎవరూ వివాద పడరు. కాని ఆ సర్వాంతర్యామి అరణ్య వాసముచేసిన దండకారణ్య ప్రాంతము మాత్రము మాదంటే మాదే నంటూ స్థల పురాణాలే కాక రామ ప్రతిష్ట దేవాలయాలులు దేశ మంతటా ఉన్నాయి.

పేరవరము ఒక గ్రామము. తూర్పు గోదావరి జిల్లాలో కోనసీమగా పేరు కెక్కిన అమలాపురము పార్లమెంటరీ నియోజక వర్గములోని ఒక అసెంబ్లీ నియోజకవర్గమైన కొత్తపేట ప్రాంతములోని ఆత్రేయపుర మండలములో ఈ పేరవరము గ్రామ ముంది. ఈ ఆత్రేయ పురములో ఒక రావి చెట్టు వుంది. ఇది సీతారాముల వనవాసకాలము నాటిదని భావించే ఈ గ్రామ ప్రజలు ఈ చెట్టు క్రింద కూర్చుని అసత్య ప్రమాణము చేయటానికి నేటికి భయపడతారు. మండలమంతా దండకారణ్య ప్రాంతముగా ప్రజలు భావిస్తారు. రాజమండ్రి రైల్వే స్టేషను నుండి ధవళేశ్వరము కాటన్ బ్యారేజి మీదుగా ''బొబ్బర్లంక – రావులపాలెం'' బస్సు రూటులో ఉన్న ఈ ఆత్రేయపుర మండలములో బొబ్బర్లంకకు తరువాతి గ్రామముగ మూడు కిలోమీటర్ల దూరములో ఉంది ఈ పేరవరము.



ఆలయదృశ్యం

ఈ పేరవరము పరిసర ప్రాంతములో జరిగిన సీతాపహరణ ఘట్టములో జటాయువు రావణున్ని వీరోచితంగ ఎదురించి ప్రాణాలు కోల్పోయాడని ప్రజల విస్వాసము. శ్రీరాముడు జటాయువుకు ఇక్కడ అగ్ని సంస్కారం జరిపి పిండాలు సమర్పించాడని కథనం. పెండ్యాల గ్రామనామము ఈ విషయాన్ని ధ్వనింప చేస్తుండడాన్ని బట్టి జటాయువు ''పేరవరం – రాజవరం'' ప్రాంతములో అసువులు బాసాడని

కథనం ప్రచారమైంది.

రావణ వధ దోష నివారణార్థము రాముడు అయోధ్యకు తిరిగి వెళ్లిపోతూ, తాను సంచరించిన స్థల ప్రాధాన్యమున్న ప్రతి చోట శివలింగాన్ని ప్రతిష్టించాడట. జటాయువు ఎదిరించిన స్థలము కాబట్టి ఈ చోట లభించిన శివలింగము రామ ప్రతిష్టగా భావించి దేవాలయము నిర్మించారట. శివాలయాన్ననుసరించే నేటి పేరవరము గ్రామము పెరిగిందని, సుమారు ఓ వంద సం ల క్రితము వరకు ఇప్పటి సాగు భూములలో పాతగ్రామపు అవశేషాలు దున్నినపుడు దొరికేవని రైతులు చెపుతారు. పాత పేరవరము సాగు భూములుగాను, కొత్త పేరవరము నేడు ఇండ్లతోను నిండి పోయాయి శివాలయమునానుకొని.

ఈ శివాలయములో ఓ విశేషము ఉంది. శివాలయము గర్భగుడిలో శివలింగము ప్రక్కన ప్రతిష్ఠించిన అమ్మవారు ''ఉమ'' ను తొలగించి బయట గర్భగుడి ప్రవేశ ద్వారము బయట ఒక గూడును నిర్మించి అక్కడ ప్రతిష్ఠించారు. గుడి నిర్మాణము జరిగిన తరువాత గ్రామము త్వర త్వరగా అభివృద్ధి చెందిందని అయితే గృహనిర్మాణాలు తరచు అగ్ని ప్రమాదానికి గురైన కారణంగ - అమ్మవారిని గర్భ గుడిలో తొలగించి ప్రవేశ ద్వారము గూడులో ప్రతిష్ఠించారని చెపుతారు. ఆ తరువాత గృహ దహనాలు ఆగిపోయాయట. ప్రవేశద్వారము ఎడమ వైపు గుడిలో వినాయకుడు ప్రతిష్ఠింప బడ్డాడు. గర్భ గుడిలో శివలింగము మాత్రమే వుంది. శివలింగము ఒక అడుగు ఎత్తుంది. చైత్ర శుద్ధ ఏకాదశినాడు ఉమా రామలింగేశ్వ రుల కళ్యాణము జరుగుతుంది. ఇటీవలే విరాళాలతో ఈ పురాతన దేవాలయానికి ముఖ మంటప నిర్మాణము జరిగింది. వానకు తడిసి ఎండకు ఎండే నంది ఈనాడు ముఖ మంటప నీడలో తన పురాతనత్వాన్ని చాటుకొంటూ భక్తులకు కనువిందు చేస్తున్నాడు.

ఉమా రామలింగేశ్వరుడు ఈ గ్రామము పుట్టినప్పటినుంచి ఉన్న రామ ప్రతిష్ఠితమని ప్రజల విశ్వాసము. కళ్యాణము పూజారులే జరిపిస్తారు. అయితే పిల్లలు లేనివారు ఈ స్వామికి కళ్యాణము జరిపిస్తే పిల్లలు పుడతారన్న నమ్మకం ఇటీవల కాలములో వేగముగ పుంజుకుంది. ప్రతి సోమవారము భక్తుల భజనలతో హోరెత్తే ఈ దేవాలయానికి వత్సవాయ మరియు కొబ్బెర్ల కోటవారు భూదానము చేశారు. కాని ఎప్పుడో నిర్ణయించిన కౌలుదారీ విధానము వల్ల దేవుడికి దీపానిక సరి పోయేటంత ఆదాయమూ లేదు. భక్తులే స్వచ్ఛందంగా దేవాలయాన్ని జీర్ణ స్థితికి రాకుండా కాపాడు కుంటున్నారు.

# మీరూ రాయండి!

పవిత్రమైన ఈ భారతావనిలో ఎన్నెన్నో ప్రాచీన ఆలయాలు, అద్భుతమైన కళా నైపుణ్యం, అనంతమైన చరిత్రగల ఆలయాలు ఎన్నో! వాటి గురించి తెలుసుకోవాలని అందరికీ ఉంటుంది.

**అందుకే మీరూ రాయండి!**

మీ సమీపంలో ఉన్న దేవాలయాల చరిత్ర, విశేషాలు, స్వామివారి మహిమలు మీరూ రాయండి. **రచనతోపాటు ఆలయం ఫోటోలు జతచేయడం మరువకండి. ఫోటోలు లేని వ్యాసాలు పరిశీలించ బడవు.**

**కవరు మీద, రచనమీద 'మనదేవాలయాలు' శీర్షికకు అని రాయండి.**

మీ రచనలు పంపవలసిన చిరునామా:

సంపాదకుడు,

సప్తగిరి మాస పత్రిక,

తి.తి.దేవస్థానములు, తిరుపతి-517 507.

# శ్రీ బుగ్గమల్లేశ్వరస్వామివారి
# దేవాలయ చరిత్ర

బుగ్గమల్లేశ్వర దేవస్థాన కమిటి, మోర్జంపాడు.

గుంటూరుజిల్లా మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి ఈశాన్యంగా మూడు కిలోమీటర్ల దూరంలో పురాతనమైన శ్రీ బుగ్గమల్లేశ్వరస్వామివారి దేవాలయము వున్నది. పూర్వం ఋషులచే నిర్మించబడిన ఈ దేవాలయం 5 సంవత్సరాల క్రితం ధ్వజస్తంభంతో సహా స్వామివారి ప్రతిష్ఠ మరల జరిగినది. 12 ఎకరముల భూమిని అప్పటి రెడ్డి రాజుల ఆధ్వర్యంలో మాన్యంగా ఇచ్చి మండాది సీతారామయ్య అర్చకత్వంలో దీప ధూపాదులు నిర్వహించుచుండిరి.

ఈ ఆలయ గర్భాలయంలో అంతరాలయం ముందు భాగాన 16 స్తంభాల విశాల ముఖ మండపంతో విరాజిల్లుతుంది. గర్భగుడిలోని స్వామి వారికి కుడివైపున ఆనుకొని గజం పొడవు గజం వెడల్పు కొలతలు గల నాలుగు అడుగుల లోతుకల నీటి బుగ్గ వున్నది. ఈ కారణంగానే స్వామివారిని బుగ్గమల్లేశ్వరస్వామి అంటారు. ఈ బుగ్గలో నీరు అన్ని కాలాల్లో వుంటుంది. గర్భాలయంలోకి సూర్యరశ్మి సోకకున్నా బుగ్గలోని నీరు చెడిపోక స్వచ్ఛంగా తియ్యగా వుంటాయి. ఈ నీటితోనే స్వామివారిని అభిషేకించటం జరుగుతుంది. గర్భగుడి అంతరాలయంలో శ్రీ వీరభద్రస్వామి భద్రకాళి అమ్మవారలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయం ప్రాకారంలోపల ఉత్తరంగా వృద్ధ మల్లేశ్వర స్వామివారు, శ్రీశైలంలో మాదిరిగా వాయువ్యదిశలో ఎత్తైన ప్రదేశంలో శ్రీభ్రమరాంబఅమ్మవారి దేవాలయం వున్నది. దక్షిణంవైపున శ్రీ సీతారామాంజనేయ స్వామివారి ఆలయం ఉన్నది. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి.



శ్రీ బుగ్గమల్లేశ్వరస్వామివారు

ఈ పుణ్యక్షేత్రంలో గతంలో ఋషులు తపస్సు చేశారని ప్రతీతి. పూర్వాచారం ప్రకారం ప్రతి కార్తీక పౌర్ణమికి మహా శివరాత్రికి తొలిఏకాదశి పర్వదినాలలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించి, భక్తుల సహకారంతో ఆ రోజు భోజన వసతులు మరియు రాత్రికి జాగారణలతో భక్తులు భజనలు, కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఆలయానికి ఆగ్నేయంగా నాగేంద్ర స్వామివారి పుట్ట వున్నది. ఇక్కడ స్వామివారిని ప్రదక్షిణములు చేసిన వారికి సంతానము లేనివారికి సంతానము కలిగిన నిదర్శనములు ఉన్నవి. ఆలయ ప్రాకారంలోపల కొలను ఉన్నది. బయట మరొక కొలను ఉన్నది. భక్తుల సౌకర్యార్థం మోర్జంపాడు నుండి నేరుగా ఆలయంవరకు రోడ్డు వున్నది.